ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
3
బుధవారం 6 నవంబరు 2024

కారుచౌకగా కొట్టేసి.. అడ్డగోలు అనుమతులు

- రైతులను భయపెట్టి, దాడులు చేసి భూముల కొనుగోలు
- రెవెన్యూలోకి మార్చి 400 ఎకరాల అటవీ భూముల ఆక్రమణ
- సీఎంగా చంద్రబాబు, ఎన్డీఏ రాకుంటే రాష్ట్రం పరిస్థితి వేరుగా ఉండేది
- సరస్వతి భూముల పరిశీలనలో జగన్‌పై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ధ్వజం



మాచవరం, పిడుగురాళ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి పదవిని.. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆనాడు వైఎస్‌ఆర్, మొన్నటి జగన్ సరస్వతి పవర్ పేరుతో ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. రైతులకు చెందిన భూములను కారుచౌకగా కొట్టేశారు. అడ్డగోలుగా అనుమతులు పొందారు..' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం వేమవరం, చెన్నాయపాలెం మధ్యలో సరస్వతి పవర్ ఇండస్ట్రీ పేరుతో (మిగతా 4వ పేజీలో)

అధికారంతో రాసేసుకున్నారు

సహజవనరులు అందరి సొత్తు అయినా జగన్ ఇష్టానుసారంగా వాడుకున్నారు. సరస్వతి సిమెంట్స్ పేరుతో అనుమతులు ఇవ్వరేమోనని సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీ పేరుతో అనుమతులు పొందారు. సిమెంట్‌కు ఉపయోగించే క్లింకర్ తయారీకి మాత్రమే అనుమతి తీసుకున్నారు. పర్యావరణ, పొల్యూషన్ అనుమతుల కోసం జగన్ దరఖాస్తు కూడా చేయలేదు. అధికారం అండతో 196 కోట్ల లీటర్ల కృష్ణాజలాల కేటాయింపులు చేసుకున్నారు. సీఎంగా నాడు రాజశేఖర్‌రెడ్డి, ఆ తర్వాత జగన్ వాళ్లంతట వాళ్లే సరస్వతి పేరుతో భూముల నుంచి అనుమతుల వరకు రాసుకున్నారు. వైఎస్ హయాంలో 31 సంవత్సరాల లీజుకు తీసుకున్నారు. 2014-19 మధ్యలో జగన్ 50 ఏళ్లు పాటు ఉండేలా లీజును పొడిగించుకున్నారు. రైతులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చేందుకే ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు.

సరస్వతి భూముల వద్ద మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఓపెన్ టాప్ వాహనంపై నుంచి మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

భూములపై విచారణకు ఆదేశాలు

రైతుల ఇష్టంతో పనిలేకుండా దాడులు చేసి భూములు కొనుగోలు చేశారు. ప్రభుత్వ భూములు, చుక్కల భూములు, కుంటలు, కాల్వలు సైతం జగన్ కలిపేసుకున్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన భూములు కాకుండా వందల ఎకరాలు భూములు ఆక్రమించారు. అటవీ భూములున్నా రెవెన్యూ అనుమతి లేకుండానే పేరు మార్చేసుకున్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కలెక్టర్ అరుణ్‌కుమార్‌ను పవన్‌కల్యాణ్ ఆదేశించారు. రైతులపై దాడులు చేస్తే కఠినచర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. ఉపాధి పేరుతో రైతులకు ఆశ కల్పించి ఇప్పటి వరకు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టకపోవడంపై కూడా సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు.



సరస్వతి భూముల వివరాలను పవన్‌కల్యాణ్‌కు వివరిస్తున్న కలెక్టర్ అరుణ్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే యరపతినేని

రేపు తాళ్లాయపాలేనికి.. సీఎం చంద్రబాబు

- 400 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభించనున్న సీఎం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

తుళ్లూరు/గుంటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం తాళ్లాయపాలేనికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 400/220 కేవీ సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో ఆయా ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ మంగళవారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ సీఆర్డీఏ పరిధిలో కార్యాలయాల డిమాండు, భవిష్యత్ అవసరాలకు తగినట్లు ఉండేలా తాళ్లాయపాలెంలో 400/220 కేవీ సబ్‌స్టేషన్‌ను జీఐఎస్ పద్ధతిలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం అనంతరం ఇతర జిల్లాలకు సంబంధించిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. బుధవారం సాయంత్రంలోపు పనులన్నీ పూర్తి చేసి ట్రయిల్ రన్ కూడా నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పోవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాష, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, ఎంపీడీవో శిల్ప, తహసీల్దార్ సుజాత తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు ప్రారంభించనున్న తాళ్లాయపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి

కంది.. లాభాల సాగు

- కంది.. లాభాల సాగు
- గత ఏడాదికన్నా పెరిగిన వైనం
- పత్తి సాగుకు ప్రత్యామ్నాయంగా కంది
- ఆశాజనకంగా గిట్టుబాటు ధరతో రైతుల్లో ఆసక్తి

పిడుగురాళ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆశాజనకంగా వర్షాలు.. పత్తి సాగులో నష్టాలు.. మొత్తంమీద పల్నాడులో రైతులు పంట మార్పిడితో కందిసాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అధికంగా వర్షాలు పడుతుండటంతో రైతులు రెండేళ్లుగా పత్తి సాగుకు విరామం ఇస్తూ కంది వైపు దృష్టి సారిస్తున్నారు. పల్నాడు ప్రాంతంలో ఐదేళ్ల క్రితం రెండంకెల లోపు హెక్టార్లలో కందిసాగు ఉండేది. క్రమేపి కందులకు గిట్టుబాటు ధర లభిస్తుండటం, ఖర్చు తక్కువ, ఆదాయం వస్తుండటంతో కంది సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. పిడుగురాళ్ల, వినుకొండ, నరసరావుపేట, దుర్గి ప్రాంతాలలో దాల్ మిల్లులు ఎక్కువగా ఉండటం, వ్యాపారులు నేరుగా వచ్చి కంది కొనుగోలు చేస్తుండటం కూడా రైతులకు కలిసి వస్తుంది. ప్రభుత్వం కూడా మార్కెట్ కమిటీల ద్వారా కంది కొనుగోలు చేస్తుంది. క్వింటా ధర రూ.7,500 పైచిలుకు ఉండటంతో రైతులు కంది సాగుకు ఆసక్తి చూపుతున్నారు. పిడుగురాళ్ల, మాచర్ల వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలో ఈ ఏడాది 19 వేల హెక్టార్లకు పైగా రైతులు కందిపంటను సాగుచేశారు. గత ఏడాది కంది సాగు చేసిన రైతులకు ఆశించిన స్థాయిలో కంది పంటకు గిట్టుబాటు ధర లభించడంతో ఈ ఏడాది కూడా రైతులు కందిసాగుపై మొగ్గుచూపారు. కొన్నేళ్లుగా పల్నాడు ప్రాంతంలో పత్తిసాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలను చవిచూడటంతో పంట మార్పిడితో కందిసాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.



జూలకల్లు సమీపంలో సాగులో ఉన్న కంది పంట

ఖర్చు తక్కువ



అధిక వర్షాలు, గులాబి రంగు పురుగు ఉధృతితో పత్తి పంట సాగు గణనీయంగా తగ్గించాల్సి వచ్చింది. ఖర్చు తక్కువగా, అధిక ఆదాయం కంది సాగులో వస్తుంది. దీంతో రెండేళ్లుగా పత్తికి బదులు కంది సాగుకు మొగ్గు చూపాను.

-యడ్లపల్లి శివ, రైతు

కొండమోడు-పేరేచర్ల రోడ్డు టెండర్ ఆమోదం

- త్వరలో ప్రారంభం కానున్న రహదారి విస్తరణ పనులు
- కేంద్రమంత్రి గడ్కరికి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కృతజ్ఞతలు



నరసరావుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొండమోడు - పేరేచర్ల జాతీయ రహదారి విస్తరణ పనుల టెండర్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఏళ్ల తరబడి నిలిచిన ఈ రహదారి నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. నాలుగు వరసల జాతీయ రహదారి(ఎన్‌హెచ్ -167 ఏజీ)గా విస్తరణకు నిర్మాణ బాధ్యతలను ఆర్‌ఆర్‌ఎస్‌ఎం ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రూ.556.80 కోట్లకు వేసిన బిడ్‌ను కేంద్ర మంత్రిత్వ శాఖ ఆమోదించింది. జాతీయ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కృషి చేశారు. రహదారి పనులకు ఉత్తర్వులు విడుదల చేసిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరికి శ్రీకృష్ణదేవరాయలు కృతజ్ఞతలు తెలిపారు.

టోల్ బాదుడు

- ఒకేసారి 25.9 శాతం చార్జీల పెంపు
- కమర్షియల్ వాహనాలకు ఆర్థిక భారం
- ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయం ఆర్టీసీపై ప్రభావం



గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) టోల్‌గేట్ చార్జీలను భారీగా పెంచింది. వివిధ రకాల వాహనాలపై ఒకేసారి 25.9 శాతం పెరిగింది. అంతేకాకుండా తిరుగు ప్రయాణం విషయంలో నిబంధనని సవరించింది. గతంలో ఒకసారి రిటర్న్ జర్నీ తీసుకుంటే 24 గంటల వ్యవధిలో ఎన్నిసార్లు అయినా టోల్‌గేట్‌ని క్రాస్ చేయవచ్చు. అలాంటిది ఇప్పుడు ఒక్కసారికి మాత్రమే దానిని కుదించింది. పెరిగిన టోల్‌చార్జీలు ఏపీఎస్‌ఆర్‌టీసీ పైనా ప్రభావాన్ని చూపనున్నాయి. గుంటూరు - విజయవాడ మధ్య కాజా, చిలకలూరిపేట - ఒంగోలు మార్గంలోని బొల్లాపల్లి, పిడుగురాళ్ల - పొందుగల మధ్య బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న టోల్‌గేట్ల చార్జీలు భారీగా పెరిగాయి. కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన (మిగతా 4వ పేజీలో)

డిగ్రీ ప్రొవిజనల్ సరిపోదంట

- సీఈవో ఆదేశాలకు విరుద్ధంగా బీఎల్వోలు
- పట్టభద్రులుగా ఓటు హక్కు అర్హతపై వక్రభాష్యం
- పది, ఇంటర్ సర్టిఫికెట్లు తప్పనిసరి అంటున్న వైనం
- అధికారుల తీరుతో దరఖాస్తుకు వెనకడుగు వేస్తున్న ఓటర్లు

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఓటుహక్కు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలతో ఏర్పాటైన యూనివర్సిటీలు జారీ చేసిన డిగ్రీ సర్టిఫికెట్ ఏదైనా ఉంటే చాలని ఒకపక్క రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ స్పష్టం చేస్తున్నారు. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని కొందరు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని సమాచారం. ఓటుహక్కు దరఖాస్తుని ప్రాసెస్ చేయాలంటే తమకు తప్పనిసరిగా 10, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్లు చూపించడంతో పాటు వాటి కాపీలపై గజిటెడ్ అధికారి సంతకం చేసి ఉండాలని స్పష్టం చేస్తున్నారు. అలానే ఫారం-18 హార్డ్ కాపీ కూడా ఇవ్వాలంటున్నారు. ఇవన్నీ ఇస్తేనే దరఖాస్తుని ప్రాసెస్ చేసి ఏఈఆర్‌వో/ఈఆర్‌వోలకు పంపుతామని, లేకుంటే తీసుకునేది లేదని చెబుతున్నారు. దీంతో గతంలో మూడు సార్లు పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారు. ఎన్నికల సంఘం పట్టభద్రుల ఓటుహక్కు అర్హత విషయంలో స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. అయితే గుంటూరు నగరంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వోలను ఈఆర్‌వోలు తప్పుదోవ పట్టించారు. 10, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలని, లేకుంటే దరఖాస్తుని తిరస్కరించాలని ఆదేశించారు. ఆ మేరకు బీఎల్‌వోలు ఎలా పడితే అలా దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలను నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ ఓబులేసు దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా తమకు తెలియదని సమాధానం చెప్పారు. అలాంటి ఆదేశాలు ఏమైనా ఉంటే తమకు ఇస్తే పరిశీలిస్తామన్నారు. గుంటూరులో బీఎల్‌వోలు, ఈఆర్‌వోలు వ్యవహరిస్తున్న తీరుపై రాజకీయ పార్టీల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు, మూడు సార్ల నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారు ఇప్పుడు అనర్హులని చెబుతుండటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. దీనిపై తాము ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు.



నేటితో గడువు ముగింపు

ఓటరు నమోదు కోసం సెప్టెంబరు 30వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకారాన్ని ఎన్నికల సంఘం ప్రారంభించింది. ఈ నెల 6వ తేదీ బుధవారం సాయంత్రం వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రకటించింది. అయితే ఓటర్ల సంఖ్య గతంలో కంటే పెరగకపోగా తగ్గే పరిస్థితులు కొంతమంది అధికారుల ప్రవర్తన కారణంగా తలెత్తాయి. ఓటరుగా నమోదయ్యేందుకు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దాంతో చాలామంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అలానే ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న అభ్యర్థులు శిబిరాలను ఏర్పాటు చేసి పట్టభద్రులతో దరఖాస్తు చేయిస్తున్నారు.

స్పందన అంతంతే..

కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఎన్నిక కోసం ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియకి ఆశించినంతగా స్పందన కనిపించడం లేదు. ఈ సారి ఓటర్ల సంఖ్య దాదాపుగా 3.50 లక్షల నుంచి నాలుగు లక్షల వరకు చేరుకోవచ్చని ఎన్నికల అధికారులు అంచనా వేశారు. 2019లో ఎన్నికలు జరిగినప్పుడు 2,48,799 మంది ఓటర్లుగా నమోదయ్యారు. అయితే ఈ దఫా ఇప్పటివరకు కేవలం 1.50 లక్షల దరఖాస్తులు మాత్రమే ఆరు జిల్లాల నుంచి అందాయి. ఈ నేపథ్యంలో లక్ష్యానికి చాలాదూరంలో ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాలు నిలిచాయి. మహా అయితే మరో 50 వేల దరఖాస్తులు కంటే ఎక్కువ వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

వైసీపీ నేత అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఆర్డీవో విచారణ


చిరుమామిళ్ళలో విచారిస్తున్న ఆర్డీవో మధులత

నాదెండ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిరుమామిళ్ళకి చెందిన వైసీపీ నేత, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డితో పాటు కుటుంబసభ్యులు చేసిన అక్రమ రిజిస్ట్రేషన్‌పై నరసరావుపేట ఆర్డీవో మధులత మంగళవారం విచారణ జరిపారు. గ్రామంలోని సర్వే నెంబరు 174 చెరువు పోరం బోకు భూమిని 173-ఏ సర్వే నంబరుగా దొంగ సర్టిఫికెట్ పుట్టించిన కోటిరెడ్డి తన చిన్న కోడలు యశోద పేరుతో 2002లో రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆమె నుంచి సాయిబాబా ట్రస్ట్ చైర్మన్‌గా ఉన్న మేకల రామిరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి సొమ్ము చేసుకున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఈ క్రమంలో గడిచిన ఆదివారం చెరువు స్థలంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌తో సహా ఆ ప్రాంతాన్ని సర్వే చేసిన అధికారులు చెరువు పోరంబోకుగా నిర్ధారించారు. దీనిలో భాగంగా ఆర్డీవో మాధవిలత ఆ గ్రామాన్ని సందర్శించి విచా రణ జరిపారు. 2013 సంవత్సరంలో వీఆర్‌వోగా పని చేసిన చిన బ్రహ్మంను పిలి పించి విచారించారు. 2022 సంవత్సరంలో సర్టిఫికెట్ ఇచ్చారా? అని ఆమె ప్రశ్నించగా, ఆ సర్టిఫికెట్‌తో తనకు సంబంధం లేదని చినబ్రహ్మం తెలిపారు. గతంలో చిన బ్రహ్మంకు సంబంధించిన రికార్డు పరిశీలించాలని, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించిన రామిరెడ్డి వద్ద ఉన్న ఆధారాలు తీసుకొని నివేదిక పంపాలని తహసీల్దార్ ఏవీ రమణకు సూచించారు. ఆర్డీవో వెంట గ్రామానికి చెందిన బీ శ్రీనివాసరెడ్డి, జీ హరి కృష్ణ, సర్వేయర్ రాంబాబు, వీఆర్‌వో, కార్యదర్శులు ఠాకూర్‌రెడ్డి, ప్రేమ్‌రాజ్, స్వాతి ఉన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు తేదీ 9వరకు పొడిగింపు

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 9, 11 తరగతుల్లో మిగిలిన ఉన్న సీట్ల కోసం ప్రవేశ పరీక్షకు దర ఖాస్తు చేసుకొనే చివరి తేదీని ఈ నెల 9 వరకు పొడిగించినటు ప్రిన్సిపల్ నల్లూరి నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 8, 2025న నిర్వహించనున్నట్టు, అదనపు సమాచారం కోసం జవహర్ నవోదయ విద్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

'విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన' పురస్కారానికి పెనుగొండ లక్ష్మీనారాయణ ఎంపిక



గుంటూరు(తూర్పు), నవంబరు 5(ఆంధ్ర జ్యోతి): అప్పా జ్యోసుల విష్ణు భొట్ల కందాళం ఫౌండేషన్ వారు ప్రతిష్ఠాత్మకంగా అందజేసే విశిష్ట సాహితి మూర్తి జీవిత కాల సాధన పుర స్కారానికి ప్రముఖ సాహితీవేత్త పెనుగొండ లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు. 2025 జనవరి 3, 4, 5 తేదీలలో విజయవాడలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో జరిగే సభలో ఈ పురస్కారాన్ని ఆయనకు అందజేస్తారు. 1972లో 'సమిధ' అనే కవితా ప్రచురణతో తన సాహిత్య ప్రస్థానం చేపట్టిన లక్ష్మీనారాయణ, రేపటిలోకి కవితాసంపుటి, అనేక, విదిత, దీపిక వ్యాస సంపుటాలు, కామ్రేడ్ పులుపుల వెంకటశివయ్య జీవితచరిత్ర, గుంటూరు సీమ సాహిత్య చరిత్ర రచయిత, గుంటూరు కథలు, విశాలాంధ్ర తెలుగుకథ, అరాజకీయం, కథాస్రవంతి సంపుటాలు, తిలక్ సాహితీ సందర్శనం, బల్గేరియా కవిత, కవితా ఓ కవితా సంకలనాలు, కవితా స్రవంతి సంకలనాలు, కథా స్రవంతి సంకలనాలు మొదలైన 90కి పైగా సాహిత్య పుస్తకాలకు సంకలనకర్తగా, సంపాదకునిగా, సహ సంపాదకునిగా ఆయన అనేక సేవలందించారు. ఈ సందర్భంగా పురస్కారానికి ఎంపికైన పెనుగొండ లక్ష్మీనారాయణను పలువురు సాహితి వేత్తలు, ప్రముఖులు, రచయితలు అభినందించారు.

ప్రతి నీటి బిందువు కాంతి సింధువైంది

- టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టును పరిశీలించిన చీఫ్ ఇంజనీర్ కాంతారావు
- వరుసగా మూడో ఏడాది రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి


ఎంసీఆర్‌ను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ కాంతారావు, ఇతర ఇంజనీర్లు

రెంటచింతల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నీటి బిందువు కాంతి సింధువుగా మారిందని, రికార్డుస్థాయిలో విద్యుదుత్పత్తి చేయడం హర్షణీయమని శ్రీశైలం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ డీవీఎస్ఎస్ఎల్ కాంతారావు అన్నారు. సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మించిన నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టును మంగళవారం ఆయన సందర్శించారు. కాంతారావు మాట్లాడుతూ ప్రతి ఏటా మార్చి 31 వరకు నిర్దేశించిన 78 ఎంయుల విద్యుత్ తయారవుతుందని, వరుణుడు సకాలంలో కరుణించడం, ఉద్యోగుల కృషి వలన నవంబరు 4వ తేదీ రాత్రికే ఈ లక్ష్యాన్ని అధిగమించామంటూ హర్షం వ్యక్తం చేశారు. మరో 5 నెలలో ఇంకా విద్యుత్ ఉత్పత్తి జరిగే అవకాశం ఉందని, ఆ దిశగా అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని బేరీజు వేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి కేవలం 0.7284 ఎంయుల విద్యుత్ మాత్రమే తయారైందని అందుకు అధికారులు బాధ్యులు కాదని ,ఎగువన ఉన్న సాగర్ నుంచి నీరు వస్తుంటేనే విద్యుత్ ఉత్పత్తి సాధ్యమౌతుందని స్పష్టం చేశారు. ఎంసీఆర్(మెయిన్ కంట్రోల్ యూనిట్) పలు విభాగాలను పరిశీలించిన ఆయన, ప్రాజెక్టు స్వరూప స్వభావాలను తెలుసుకున్నారు. రూ.1050 కోట్లతో నిర్మితమైన ఈ ప్రాజెక్టులో 2017 జనవరి 9న మొదటిసారి విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ పేర్కొన్నారు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 551.47 ఎంయుల విద్యుత్ తయారైందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచుకుని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఈ కె.వెంటకరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, ఏడీఈలు నాగరాజు,రత్తయ్య,మెహబూబ్,గిరిబాబు,జయశంకర్,సుబ్బారావు పాల్గొన్నారు.

కుడి జలవిద్యుత్ కేంద్రంలో పరిశీలన

మాచర్ల రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్ నాగార్జున సాగర్ కుడి జల విద్యుత్ కేంద్రాన్ని ఏపీ జెన్‌కో శ్రీశైలం కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ కాంతారావు మంగళవారం పరిశీలించారు. జల విద్యుత్ కేంద్రంలో మరమ్మతులకు గురైన మూడో యూనిట్‌ను పరిశీలించి త్వరితగతిన యూనిట్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కుడికాలువ క్రస్ట్ గేట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం శ్రీసీతారాముల ఆలయాన్ని సందర్శించారు. సీఈ వెంట ఎస్ఈ రమణ, ఓఅండ్ఎం ఆర్‌సీపీహెచ్ డీఈ అప్పాజి, డీఈ రాజారెడ్డి, ఏడీఈ మోహన్‌బాబు, ఏఈఈ గౌతమ్‌కుమార్, అమర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలకు

అండర్-19 విభాగంలో బొంత రాజు ఎంపిక



చిలకలూరిపేట, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ అండర్-19 విభా గంలో కావలిలో ఈ నెల 6, 7, 8 తేదీలలో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక ఏఎంజి హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి బొంత రాజు ఎంపిక అయ్యాడు. ఈ విద్యార్థి ఇటీవల బాపట్ల జిల్లా వీవీ పాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ సెలక్షన్స్‌లో పాల్గొని విశేష క్రీడా ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. ఈ విద్యార్థిని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ మహంతి, హైస్కూల్ హెచ్ఎం కృపాదానం మంగళవారం అభినందించారు.

నేటి నుంచి మంగళగిరిలో కూచ్ బెహార్ ట్రోఫీ

మంగళగిరిసిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూచ్ బెహార్ ట్రోఫీలో భాగంగా ఆంధ్ర, హిమాచల్‌ప్రదేశ్ జట్ల మధ్య మంగళగిరి లోని ఏసీఏ అంతర్జా తీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం నుంచి ఈ నెల 9 వరకు మ్యాచ్ జరుగు తుందని ఏసీఏ కార్యదర్శి సానా సతీశ్ బాబు వెల్లడించారు. మ్యాచ్‌లో తలపడేం దుకు ఇరు జట్లు సన్నద్ధ మయ్యాయని చెప్పారు. మ్యాచ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ నిర్వహించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.


ఇర్లపాడులో మురిగిపోయి పచ్చగా మారిన కోడిగుడ్లు

మధ్యాహ్న భోజనానికి నాణ్యతలేని కోడిగుడ్లు సరఫరా

ఇర్లపాడు (శావల్యాపురం) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభు త్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు నాణ్యంగా లేకపోవడంతో వాటిని తినలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కొత్తలూరు పంచాయతీ పరిధిలోని ఇర్లపాడు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అందించేందుకు ఎండీఎం ఆపరేటర్లు కోడిగుడ్లను ఉడక పెట్టగా వాటిలో కొన్ని కుళ్ళిపోవడం, కొన్ని పచ్చగా మారడంతో ఉపాధ్యాయులు మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాకరు నాణ్యతలేని కోడిగుడ్లు సరఫరా చేస్తుండడంతో విద్యార్థులు తినలేకపోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. కోడిగుడ్ల నాణ్యతపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని, కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా నాణ్యతలేని కోడిగుడ్లు సరఫరా చేస్తున్నాడని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టోల్ బాదుడు

(3వ పేజీ తరువాయి)

చార్జీలతో కారు/జీపు/వ్యాన్ సింగిల్ జర్నీకి రూ.145, రిటర్న్ జర్నీకి రూ.220, నెలవారీ పాసు రూ.4790కి పెంచింది. అదే ఎల్‌సీవీ వాహ నానికి సింగిల్ జర్నీకి రూ.245, బస్సు/ట్రక్‌కు రూ.515, మూడు యాక్సిల్ వాహనం వరకు రూ.565, 4 నుంచి 6 యాక్సెల్స్ ఉన్న వాహ నాలకు రూ.810, హెచ్‌సీఎం/ఈఎంఈకి రూ.810, 7, అంతకంటే ఎక్కువ యాక్సెల్ వాహనాలకు రూ.820కి పెంచింది. రిటర్న్ జర్నీ ఎల్‌సీవీకి రూ.370, బస్సు/ట్రక్‌కు రూ.770, త్రీ యాక్సెల్ వరకు వాహ నాలకు రూ.845, 4 నుంచి 6 యాక్సెల్ వరకు వాహనాలకు రూ.1215, హెచ్‌సీఎం/ఈఎంఈకి రూ.1215, ఏడు, అంతకంటే ఎక్కువ యాక్సెల్ ఉన్న వాహనాలకు రూ.1230కి పెంచేసింది. నెలవారీ చార్జీలను కూడా బాదేసింది. ఎల్‌సీవీకి రూ.8230, బస్సు/ట్రక్‌కు రూ.17085, త్రీ యాక్సెల్ వరకు రూ.18810, 4 నుంచి 6 యాక్సెల్ వాహనాలకు రూ.27035, హెచ్‌సీఎం/ఈఎంఈకి రూ.27035, ఏడు, అంతకంటే ఎక్కువ యాక్సెల్ వాహనాలకు రూ.27290కి పెంచింది.

బస్సు చార్జీలు పెంచక తప్పని పరిస్థితి

టోల్ ప్లాజా రేట్లు పెంచడంతో ఆర్‌టీసీ, ప్రైవేటు బస్సుల చార్జీలను తప్పక పెంచాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. గతంలో 24 గంటల్లో ఎన్ని రిటర్న్ జర్నీలైనా చేసే అవకాశం ఉన్నందున ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు ఆ చార్జీలను ప్రయాణికుల వద్దనే వసూలు చేసేవారు. ఇప్పుడు ట్రిప్పుల లెక్కన టోల్‌చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి తలెత్తింది. ఉదాహరణకు తాడికొండ - మంగళగిరి మధ్య ప్రైవేటు ఆపరేటర్ గతంలో నెలవారీ పాస్ తీసుకుంటే రూ.6500 అయ్యేది. ఇప్పుడు అపరిమిత రిటర్న్ జర్నీలు ఎత్తేయడం వల్ల నెలకు దాదాపుగా రూ.45 వేలు చెల్లించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఇదే పరిస్థితి ఆర్టీసీపై కూడా పడుతుంది. దీంతో వారు టిక్కెట్ల ధరలు పెంచి టోల్ భారాన్ని ప్రయాణికుల నుంచి వసూలు చేసే అవకాశం ఉంది.

నెలవారీ పాస్ చార్జీల్లోనూ పెరుగుదల

గతంలో టోల్‌ప్లాజాకు 20 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తూ సొంత వాహనాలు కలిగిన వారికి నెలవారీ పాస్‌లను జారీ చేసేవారు. రూ.150 కట్టించుకుని ఈ పాస్ ఇచ్చేవారు. నెలలో 50 సింగిల్ జర్నీలు చేసే అవకాశం ఉండేది. ఇప్పుడు దానిని రూ.340కి పెంచింది. 50 సింగిల్ జర్నీలు దాటితే అదనంగా చెల్లించాల్సి వచ్చేది.

కారుచౌకగా కొట్టేసి.. అడ్డగోలు అనుమతులు

(3వ పేజీ తరువాయి)

జగన్ కుటుంబం కొనుగోలు చేసిన భూములను మంగళవారం పవన్‌కల్యాణ్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ దళితులను, రైతులను భయపెట్టి సొంత కంపెనీ కోసం జగన్ కారుచౌకగా భూములు కొనుగోలు చేశారన్నారు. మాచవరం, దాచేపల్లి మండలాల్లో సరస్వతి పవర్ ఇండస్ట్రీ పేరుతో భూములు కొనుగోలు సమయంలో రైతులకు ఇచ్చిన మాటను అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి, ఆ తర్వాత జగన్‌రెడ్డి మరిచారన్నారు. దళితులను, రైతులను బెదిరించి దాడులు చేసి పెట్రో బాంబులు వేసి వేట కొడవళ్లతో వెంటాడి భూములను హస్తగతం చేసుకున్నారన్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కోడెల శివప్రసాదరావుపై వైసీపీ నేతలు దుష్ప్రచారం చేసి ఫర్నిచర్ కొట్టేశాడని అక్రమంగా కేసులు పెట్టి వేధించి చనిపోయేలా చేశారన్నారు. మరి వందల ఎకరాల భూములను కారుచౌకగా కొట్టేసి, అడ్డగోలు అనుమతులు తెచ్చుకున్న జగన్‌పై ఎన్ని కేసులు పెట్టాలని ప్రశ్నించారు. సీఎంగా చంద్రబాబు, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రాకుంటే ఏపీ పరిస్థితి వేరుగా ఉండేదని తెలిపారు. సరస్వతి భూముల విషయంపై క్యాబినెట్‌లో చర్చిస్తామన్నారు. సరస్వతి భూములపై గతంలో జరిగిన అన్ని విషయాలను యరపతినేని ద్వారా తెలుసుకున్నానని, యరపతినేని రైతులకు అండగా ఉంటున్నారన్నారు.

రైతులపై దాడులు చేస్తే ఉపేక్షించొద్దు

సరస్వతి పవర్ ఇండస్ట్రీకి భూములిచ్చిన రైతులపై దాడులు చేస్తే ఉపేక్షించవద్దని పోలీసు అధికారులను పవన్‌కల్యాణ్ ఆదేశించారు. భూములిచ్చిన రైతుల్లో ఆత్మస్థైర్యం పెరిగేలా చూడాలని ఎస్పీ శ్రీనివాసరావును ఆదేశించారు. మాచవరం మండలం చెన్నాయపాలెంలో 272.96, పిన్నెల్లిలో 93.79, వేమవరంలో 710.63, తంగెడలో 107.365 ఎకరాలు ఉన్నాయని, వాటిలో పట్టా 1083.715, చుక్కలు 76.19, అసైన్ భూములు 24.84 ఎకరాలన్నారు. అంతేకాకుండా 400 ఎకరాలు అటవీ భూములను రెవెన్యూ కిందకు మార్చేసి సరస్వతి పవర్ కోసం తీసుకున్నారన్నారు.

ఫ్యాక్టరీ నిర్మిస్తారా.. భూములిచ్చేస్తారా?

మూడేళ్లలో ఫ్యాక్టరీ నిర్మించి, యువతకు ఉద్యోగాలిస్తామని రైతులను మభ్య పెట్టి భూములు కొనుగోలు చేసి 15 ఏళ్లుగా ఆ ఊసే మరిచిన జగన్ ఇప్పటికైనా ఫ్యాక్టరీ నిర్మించడమా లేదంటే భూములు తిరిగి ఇచ్చేయడమో చేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సరస్వతి పవర్ పేరుతో తక్కువ ధరకు రైతుల నుంచి కొనుగోలు చేసిన భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి వేల కోట్ల రుణాలు తీసుకున్నారని ఆరోపించారు. ఫ్యాక్టరీ నిర్మించకుండా, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా రైతులను రోజు వారి కూలీలుగా మార్చారన్నారు. ఫ్యాక్టరీ నిర్మించకపోవడంతో కొంతమంది రైతులు భూములు సాగు చేసుకునేందుకు యత్నించగా అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిలు గూండాలతో వచ్చి దాడులు చేశారన్నారు. సాక్షి పత్రికను అడ్డం పెట్టుకుని ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు రాస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. 500 ఎకరాల భూమిని సరస్వతి భూముల్లో జగన్ కలిపేసుకున్నాడన్నారు. వందలాది మంది రైతులు కొన్నేళ్లుగా ఉపాధి లేక అల్లాడిపోతున్నా జగన్‌కు ఏమాత్రం పట్టడం లేదన్నారు. అంతకముందు సరస్వతి భూములను ఓపెన్ టాప్ వాహనంపై నుంచి పవన్‌కల్యాణ్ పరిశీలించారు. అనంతరం కొందరు రైతులతో పవన్‌కల్యాణ్, యరపతినేని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్‌గోనేరి, ఆర్డీవో మురళీకృష్ణలతో పాటు వివిధ శాఖల అధికారులు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య),నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు (ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్) ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కే మయూరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన బీసీ,ఎస్టీ,ఎస్సీ అభ్యర్థులకు ఈ నెల 14 నుంచి రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వ నున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 200 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తా మని, టెట్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే ఇందుకు అర్హులని, టీసీసీలో వచ్చిన మార్కుల ప్రాతిపదికన, ఎస్‌జీటీలకు బీఎడ్‌లో వచ్చిన మార్కుల ప్రాతిపదికన స్కూల్ అసిస్టెంట్స్‌కు శిక్షణ ఇస్తామని వివరించారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు పదో తరగతి, టీసీసీ, బీఈడీ, టెట్ మార్కుల లిస్టు, కుల,ఆదాయ ధృవీకరణ పత్రాలు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 1 లక్ష లోపు ఉండాలని సూచించారు. ఇతర వివరాలకు గుంటూరులోని రాజాగారి తోటలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌ను 0863-2358071 నంబ రులో సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని మృత దేహం లభ్యం

ముప్పాళ్ళ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్‌పీపీఎల్ పవర్ ప్లాంట్ సమీపంలో గుర్తుతెలియని మృత దేహం మంగళవారం కన్పించింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు సుమారు నాలుగైదు రోజుల క్రితం మగ వ్యక్తి కాలువలో పడి ఉంటాడని, సుమారు 60 ఏళ్ల వయస్సు ఉండొచ్చని తెలిపారు.

మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఈ మేరకు పోలీసులకు తెలియజేయగా, ఎస్ఐ సోమేశ్వరరావు సంఘ టనా స్థలానికి వెళ్ళి పరి శీలించారు. మృతుడి శరీరంపై దుస్తులు లేవు. గుంటూరు బ్రాంచ్ కెనాల్ ఉధృతంగా ప్రవ హిస్తుండ టంతో మృతదేహాన్ని వెలికితీసేందుకు చాలా సమ యం పట్టింది. అక్కడే పోస్టు మార్టం నిర్వహించారు. వీఆర్‌వో మాబూవలి ఈ మృత దేహానికి శవ పంచనామా అనంతరం పోలీసులు ఖననం చేశారు


చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న నాగేశ్వరరావు కుటుంబసభ్యులు

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50లక్షల విరాళం

చిలకలూరిపేట అర్బన్, వేల్పూరు (శావల్యాపురం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో పలువురు సీఎం రిలీఫ్ ఫండ్‌కు, అన్నక్యాంటీన్‌కు విరాళం అందజేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడును కలసి పార్టీ నేతలు గడ్డం బుచ్చారావు, ముప్పా నరేంద్ర, బొబ్బా సాంబశివరావు, గడ్డం శివ శంకర్, కోట సత్యనారాయణ, కోట అనూష, గడ్డం రాఘవ చౌదరి, పీవీ సుబ్రహ్మణ్యంలు సీఎం రిలీఫ్ ఫండ్ నిమిత్తం రూ.50 లక్షల చెక్కును ఎమ్మెల్యే ప్రత్తిపాటి చేతుల మీదుగా చంద్రబాబుకు అందజేశారు. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన సాధినేని శ్రీరాములు కుమారుడు, పౌల్ట్రీ వ్యాపారి సాధినేని నాగేశ్వరరావు, రేణుకాదేవి దంపతులు అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ.10 లక్షల విరాళాన్ని మంగళవారం అందజేశారు. అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్న మంచి ప్రభుత్వానికి చేయూత నివ్వటం అభినందనీయమని సీఎం చంద్రబాబు పార్టీ నేతలను, దాతలను ప్రశంసించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 586.60 అడుగులు ఉంది. ఇది 303.43 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9443 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5018 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 25,291 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 41,352 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా, శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 41,352 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఏఎన్‌యూ వెబ్ సైట్‌లో హాల్ టికెట్లు

పెదకాకాని, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో దూరవిద్య పరీక్షల నిర్వహణలో అవకతవకలకు పాల్పడిన శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ కేంద్రంలో పరీక్షలు రాసే విద్యార్థులకు కర్నూలు పట్టణంలోని ఎస్ఎల్ ఎస్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాన్ని మార్చిన దృష్ట్యా విద్యార్థులకు నూతన హాల్ టికెట్లు అందించనున్నారు. విద్యార్థులు అందరూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం వెబ్ సైట్ నుండి వారి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసు కోవాల్సిందిగా యూనివర్సిటీ దూరవిద్య పరీక్షలకు కో ఆర్డినేటర్ ఆచార్య డి రామ చంద్రన్ మంగళవారం తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

50,088 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 50,088 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 48,647 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 25,206 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16500	334	8000	15000
నెంబరు. 5	8000	12000	నెంబరు. 5	12000	15500
273	10000	13000	273	10000	12000
341	85000	15000	341	9000	14000
4884	10000	14600	4884	12000	13200
సూపర్ 10	-	-	సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	17500	తేజ	8500	17500
బ్యాడిగి	8000	13000	బ్యాడిగి	9000	14500
దేవనూరు డీలక్స్	9000	14500	దేవనూరు డీలక్స్	10000	14500
తెల్లకాయలు	5000	10500	తెల్లకాయలు	5000	10000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



నకరికల్లులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి

ఉద్యోగాలు ఆశచూపి భూములు కొట్టేశారు

ఈ సందర్భంగా సరస్వతి సిమెంటు ఫ్యాక్టరీకి భూములు ఇచ్చిన ఆయా గ్రామాల రైతులు పలువురు తమ బాధలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో పంచుకున్నారు. ఉద్యోగాల పేరుతో వలవేసి కారుచౌకగా తమ భూములను కొట్టేశారని, ఏళ్లు గడుస్తున్నా పరిశ్రమ ఏర్పాటు చేయలేదని, ఉద్యోగ, ఉపాధి ఊసే లేదని, పిల్లలకు ఉద్యోగాలు వస్తాయనే ఆశతో ఆనాడు పంట పండే భూమిని తక్కువ రేటుకు భూములను అమ్మాల్సి వచ్చిందని డిప్యూటీ సీఎంకు వివరించారు.

పది ఎకరాలు ఇచ్చా : బాణావత్ మంత్యా నాయక్



మా ఊరికి దగ్గరలో మా భూముల్లో సిమెంట్ పరిశ్రమ వస్తే మా పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఆనాడు పది ఎకరాలు భూమిని రూ.3 లక్షలకే ఇవ్వాల్సి వచ్చింది. నేటికి పరిశ్రమ కట్టలేదు. ఇప్పుడు భూముల ధర మూడింతలు పెరిగింది. మాకు న్యాయం చేయాలి.

తక్కువ ధరకే భూములిచ్చాం : చపావత్ హరినాయక్



పదేళ్ల క్రితమే సిమెంట్ ఫ్యాక్టరీ కడతామంటే తక్కువ ధరకే 10 ఎకరాల భూమిని ఇచ్చా. ఇప్పటికీ పరిశ్రమ కట్టింది లేదు. ఉద్యోగం ఇచ్చింది లేదు. భూములు కోల్పోయి, ఉపాధి లేక పని కోసం వలస వెళ్లాల్సి వచ్చింది.

ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలి : చపావత్ వెంకటేశ్వర నాయక్



జగన్ కుటుంబం సిమెంట్ పరిశ్రమ పేరుతో భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు ఇప్పటికైనా న్యాయం చేయాలి. ఇప్పుడున్న భూమి ధర చెల్లించడంతో పాటు నిరుద్యోగ భృతి చెల్లించి త్వరితగతిన ఫ్యాక్టరీ నిర్మించి ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలి.

రైతుల భూముల కొనుగోలుపై సమగ్ర విచారణ చేయండి



మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

పిడుగురాళ్ల, మాచవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సరస్వతి సిమెంటు ఫ్యాక్టరీ యాజమాన్యం రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన భూముపై సమగ్ర విచారణ చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జిల్లా ఉన్నతాధికారులను అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మంగళవారం పల్నాడు జిల్లా మాచవరం, దాచేపల్లి మండలాల సమీపా లలో వున్న సరస్వతి భూములను పరిశీలించారు. పవన్‌కల్యాణ్ వస్తున్నారని తెలుసుకున్న సమీప గ్రామస్థులు, రైతులు ఆ ప్రాంతానికి భారీగా చేరుకున్నారు. ముందుగా పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు స్వాగతం పలికారు. కార్వాన్ వాహనంలో ఎమ్మెల్యే యరపతినేని, పల్నాడుజిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుతో భూముల వివరాల గురించి చర్చించారు. అనంతరం భూముల్లోకి వెళ్లి అక్కడ పలు విషయాలను మాట్లాడారు. విలేకరుల సమావేశం అనంతరం పవన్‌కల్యాణ్ తిరిగి మంగళగిరికి బయలుదేరి వెళ్లారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పీ.శ్రీధర్, తహసీల్దార్లు మధుబాబు, క్షమారాణి, పంచాయతీరాజ్ అధికారులు, యరపతినేని సాయినిఖిల్, వున్నం నాగమల్లికార్జునరావు, కటికం అంకారావు, కామిశెట్టి రమేష్, బడిగుంచల వెంకటేశ్వర్లు, పాండురంగ శ్రీను, వడ్లవల్లి సర్వేశ్వరరావు, దూదేకుల ఖాశింసైదా, బొమ్మా శ్రీనివాసరావు, మాచవరం మండల జనసేన అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ కరచాలనం కోసం.

నకరికల్లు (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కరచాలనం కోసం నకరికల్లులో అభిమానులు పోటీ పడ్డారు. సరస్వతి భూముల పరిశీలన అనంతరం తిరుగు ప్రయాణంలో నకరికల్లు మండలం అడ్డరోడ్డు వద్ద అభిమానులతో కరచాలనం చేశారు. నకరికల్లులో పవన్ కళ్యాణ్ కాన్వాయన్‌కు మహిళలు అడ్డంగా నిల్చొని తమ అభిమానాన్ని చాటుకున్నారు.

జనసేన నేత జేబు కొట్టిన దుండగులు..

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సరస్వతిఫ్యాక్టరీ భూముల కార్యక్రమానికి బొల్లాపల్లి మండలం జనసేన ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. పవన్‌కళ్యాణ్ వచ్చిన సమయంలో జరిగిన తోపులాటలో వెంకటేశ్వర్లు ఫ్యాయింట్ జేబులో ఉన్న రూ.1 లక్ష ఎవరో దొంగిలించారు. జేబులో నగదు లేకపోవటంతో వెంకటేశ్వర్లు ఒక్కసారిగా అవాక్కయ్యాడు. సభ నుంచి ఇంటికి వెళ్ళే సమయంలో పొలాలకు పురుగు మందులు కొనాలనుకున్నానని, ఆ డబ్బుని ఎవరో కొట్టేశారని వెంకటేశ్వర్లు ఆవేదన చెందాడు.



కొండమోడు జంక్షన్‌లో పవన్‌కల్యాణ్‌కు ఘనస్వాగతం ..



డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో ఎమ్మెల్యే యరపతినేని



భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎమ్మెల్యే యరపతినేని



సభా ప్రాంగణానికి వస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, నిఖిల్

వరద బాధితులకు రూ.1,15,116 అందజేత

● సీఎం చంద్రబాబుకి చెక్కు అందజేసిన లింగంగుంట్ల గ్రామస్థులు



సీఎం చంద్రబాబుకి నగదు చెక్కును అందిస్తున్న నాగ జ్యోతి, భాగ్యలక్ష్మిలు

పెదకూరపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం గ్రామంలో విరాళం రూపంలో సేకరించిన రూ.1,15,116 నగదు చెక్కును మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎంచంద్రబాబు కలిసి అందజేసినట్లు లింగంగుంట్ల గ్రామస్థులు బోడపాటి నాగజ్యోతి, యలమంచిలి భాగ్యలక్ష్మిలు తెలిపారు. గ్రామానికి చెందిన వీరపనేని మురళీ, గంగినేని వెంకటేశ్వర్లు, మేదరమెట్ల శ్రీనివాసరావు, గంగినేని లీలావతిలు ఈ విరాళాలను సేకరించారని వారు తెలిపారు.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదును బాధ్యతగా తీసుకోండి

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వాలు, ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మంగళవారం టీడీపీ నేతలకు సూచించారు. పార్టీ సభ్యత్వాలు, ఎమ్మెల్సీ ఓట్ల నమోదుపై నియోజకవర్గ పార్టీనేతలతో మంగళవారం ఎమ్మెల్యే టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐదు మండలాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాలను వేగవంతం చేయాలని, ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు ఒక్క రోజు మాత్రమే గడువు ఉందని, ఏడు వేల ఓట్ల నమోదు టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. ప్రతి ఎన్నికల బూత్‌లో 300 సభ్యత్వాలు పూర్తి చేసేలా పని చేయాలని, సభ్యత్వ నమోదులో నియోజకవర్గం టాప్ - 10లో ఉండేలా నాయకులు దృష్టి సారించాలన్నారు.











రైతుల ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకు వెళ్తా

● సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ● పత్తికొనుగోలు కేంద్రం ప్రారంభం



సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ నిబంధనలతో రైతులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలోని లక్ష్మీకాటన్ ట్రేడ్‌లో మంగళవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని కన్నా లక్ష్మీనా రాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తేమ శాతం ఎనిమిది నుంచి 12 లోపు ఉంటేనే సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేస్తారని, 12 శాతం దాటితే బయ్యర్లు వెనక్కి పంపిస్తారని కన్నా దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ సీసీఐ కొత్తగా తీసుకు వచ్చిన నిబంధనల వల్ల రైతులకు కలిగే ఇబ్బందులను అసెంబ్లీ సమావేశాల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు వెళ్తను న్నట్టు కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడుతో కూడా మాట్లాడతానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సీసీ బాధ్యులతో మాట్లాడించి రైతులకు మేలు చేసేలా నిబంధనలు సడలించేందుకు కృషి చేస్తానన్నారు. సత్తెనపల్లి నియోజక వర్గ రైతులు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నేతలు ఆళ్ళ సాంబయ్య, మక్కపాటి రామచంద్రరరావు, కోమటినేని శ్రీనివాసరావు, రావిపాటి నానయ్య, మార్కెట్ యార్డు ఉద్యోగులు, సిబ్బంది, పలువురు టీడీపీ నేతలు, బీజేపీ నేతలు, జనసేన నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై దృష్టి పెట్టాలి

● మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టాలని, బుధవారంతో ఓటరు నమోదు ముగుస్తున్నందున జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. మంగళవారం ఓటర్ల నమోదుపై రెంటచింతల టీడీపీ శ్రేణులతో సమీక్షించారు. పట్టభద్రులంతా తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకునేలా టీడీపీ శ్రేణులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. రెంటచింతల మండలంలో 752 ఓట్లు నమోదైనట్లు పీహెచ్‌సీ మాజీ ఛైర్మన్ రామకృష్ణ, బీసీ నేత ఎస్ సిద్ధయ్యలు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి తెలిపారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు.

గురజాలటౌన్ (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల ఓటరు జాబితాలో ఓటరు నమోదుకు బుధవారం ఆఖరు అని తహసీల్దార్ నగేష్ మంగళవారం తెలిపారు. ఓటరుగా నమోదు చేసుకోని వారు ఉంటే ఆన్‌లైన్ లేదా రెవెన్యూ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

బెల్లంకొండ, (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు పట్ట భద్రుల నియోజక వర్గ ఓటర్లు ఈనెల 6వ తేదీ లోపు తమ ఓట్లను నమోదు చేసుకోవాలని తహసీల్దార్ మున్నీసాబేగం కోరారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అర్హత గల పట్ట భద్రులు ఓట్ల నమోదుకు ఫారం - 18, డిగ్రీ ప్రొవిజన్‌లు, అర్హత పొందిన పత్రాలతో ఆన్‌లైన్‌లో గాని, బెల్లంకొండ తహసీల్దార్ కార్యాలయంలో గాని అందజేయాలని ఆమె సూచించారు. అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.



నాణ్యమైన విద్యుత్ అందించాలి

పిడుగురాళ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించే విధంగా ప్రభుత్వం పనిచేస్తుందని పల్నాడు జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఇ డాక్టర్ పి విజయకుమార్ తెలిపారు. మంగళవారం పిడుగురాళ్ల విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరా, ఎల్‌టి డిస్ట్రిబ్యూషన్, ట్రాన్స్‌ఫార్మర్ స్కెచ్ తదితర అంశాలను పరిశీలించేందుకు ఎస్ఇ విజయకుమార్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ బిల్లుల వసూళ్లు, పెండింగ్ బకాయిలు, సోలార్ పిఎం సూర్యఘర్‌పై ఎస్ఇ సమీక్ష నిర్వహించారు. మాచర్ల డివిజనల్ నోడల్ ఆఫీసర్ సింగయ్య, సబ్‌డివిజన్‌లోని అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు


మాచర్లటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఓ వృద్ధుడు కనిపించడం లేదని కేసు నమోదైంది. పట్టణంలోని 6వ వార్డుకు చెందిన కలివెల అబ్రహం (78) ఈనెల 3న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని అతని కుమారుడు కిషోర్ ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

మాచవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం వర్షాకాలం పోయి చలి కాలం ప్రారంభ మవుతుందని, వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, వైద్యులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా డీఎం అండ్ హెచ్‌వో బీ రవి వైద్యులకు సూచించారు. మంగళవారం మాచవరం పీహెచ్‌సీని ఆయన సందర్శించారు.







అల.. వైకుంఠపురములో.. అన్నీ సమస్యలే !

కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వెంకటేశ్వరస్వామి కొలువుదీరి ఉన్న దేవస్థానమది. తిరుమల తిరుపతి తరువాత అంతగొప్పగా విరాజిల్లుతున్న దేవస్థానం తెనాలి వైకుంఠపురం శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయం. ఈ ఆలయానికి తెనాలి పరిసర ప్రాంతాల నుండే కాకుండా తెలుగురాష్ట్రాలు, ఇతర ప్రాంతాలనుండి వేలాది భక్తులు స్వామి వారి దర్శనానికి వచ్చిపోతుంటారు. తిరుమల తిరుపతిలో స్వామి వారికి జరిగే విధంగానే ఇక్కడ కూడా పూజాదికార్యక్రమాలు జరపడం ఈ దేవస్థానం ప్రత్యేకత. ఆలయంలో సౌకర్యాలు నామమాత్రంగా ఉండటంతో భక్తులకు అవస్థలు తప్పడంలేదు.



కేశఖండనశాల కూల్చివేసిన పాత భవనం



గోశాలలో పొంగలి చేస్తున్న భక్తులు

- యాగశాల కాస్త కేశఖండన శాలగా మార్పు
- గోశాల కాస్త పొంగలిషెడ్డుగా మార్పు
- శంకుస్థాపన తోనే నిలిచిన కేశ ఖండనశాల
- దుస్తులు మార్పు గదులు లేక భక్తులు ఇబ్బంది

తెనాలి రూరల్, నవంబరు 5: తెనాలి వైకుంఠపురం శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో స్వామివారికి యజ్ఞపూజలు జరిపేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక యజ్ఞశాల నేడు కేశఖండనశాలగా మారింది. కోట్లాదిమంది దేవతలను పూజించిన ఫలం ఒక్క గోపూజతోనే సాధ్యమని పురణాలు, పండితులు చెబుతుంటారు. దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గోశాల కాస్త పొంగలిషెడ్డుగా మార్చి గోవులు చెట్లకిందకు చేరాయి.



తల నీలాలు సమర్పించిన అనంతరం ఆరుబయటే బట్టలు మార్చుకుంటున్న భక్తుడు



గోశాల పొంగలిషెడ్డుకావడంతో చెట్లకింద ఉన్న గోవులు

దీంతో భక్తులకు గోపూజ దూరమయింది. దేవస్థానంలో సౌకర్యాలు మెరుగుపరుస్తూ భక్తుల మన్ననలు పొందాల్సి ఉండగా ఉన్న సౌకర్యాలు మరుగునపడుతుండటంతో స్వామివారి సేవకు వచ్చే భక్తులు గోవిందగోవింద అంటూ లెంపలేసుకుంటున్నారు.

కేశఖండనశాలకు శంకుస్థాపనతోనే సరి

ఆలయంలో భక్తులు స్వామివారి మొక్కుబడులు తీర్చుకునేందుకు ఏర్పాటు చేసిన కేశఖండన శాల భవనాన్ని గత వైసీపీ ప్రభుత్వంలో నేటమట్టం చేసి నూతన భవనాన్ని నిర్మించేందుకు అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం పాత భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేయకుండా పిల్లర్లవరకు ఆపి పనులు నిలిపివేశారు.

గోశాల కాస్త పొంగలిషెడ్డు

హిందువులు అత్యంత పవిత్రంగా గోవులను పూజిస్తారు. శాస్త్ర ప్రకారం వైకుంఠపురం ఆలయంలో గోవులను సంరక్షించేలా గోశాలను నిర్మించారు. ఐతే పొంగలి చేసుకునేందుకు ప్రత్యేక షెడ్డులేకపోవడంతో గోవులను చెట్లకింద కట్టివేసి గోశాలను పొంగలి షెడ్డుగామార్చారు.

ఆలయ కలశప్రతిష్ఠతోనే నిలిచిన పనులు

శ్రీలక్ష్మిపద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో నూతనంగా నిర్మించిన కలశప్రతిష్ఠతో తదనంతరం జరగవల్సిన పనులు నిలిచిపోయాయి. ఆలయ పర్యవేక్షకులు వాటిపై దృష్టిపెట్టి పనులు పూర్తిచేయాలని చూడాలని కోరుతున్నారు.

కేశ ఖండన టిక్కెట్టు రూ.40.. సిబ్బందికి మరో రూ.40

నాపేరు రామారావు మాది ఈమని గ్రామం. స్వామివారిని దర్శనంచేసుకుని తలనీలాలు సమర్పించేందుకు వైకుంఠపురం శ్రీ లక్ష్మిపద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థానానికి వచ్చా. అయితే కేశఖండనకు రూ. 40 పెట్టి టిక్కెట్టు తీసుకున్నా. ఇక్కడకి వచ్చి చూస్తే స్నానం చేసేందుకు కూడా సౌకర్యాలు లేవు. పాత భవనం కూల్చివేసి యాగశాలలో కేశఖండనశాల పెట్టారు. అందులోకి వెళ్లితే అక్కడ సిబ్బంది తలనీలాలకు రూ.40 ఇవ్వాలన్నారు. రూ.30 ఇచ్చి వచ్చాను. కుటుంబసమేతంగా ఆలయానికి వస్తే మహిళలు ఇబ్బందులు పడక తప్పదు. దుస్తులు మార్చుకునేందుకు సరైన వసతులు లేవు.



యాగశాలలో కేశఖండనశాల

పవిత్రమైన యజ్ఞశాలలోనే కేశఖండనశాల

యజ్ఞయాగాదులు జరిగే పరమపవిత్రమైన యాగశాలను కేశఖండన శాలగా మార్చారు. అక్కడ తలనీలాలు సమర్పించేందుకు వచ్చె భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. తలనీలాలు సమర్పించే సమయంలో నీటితో తలతడుపుకునేందుకు అనంతరం స్నానాలు చేసేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించలేదు. స్త్రీ, పురుషులు బహిరంగంగా కుళాయిల కింద స్నానాలు చేసి ఆరుబయట దుస్తులు మార్చుకునే పరిస్థితి నెలకొంది. స్త్రీలకు మాత్రం చిన్నపాటి బాత్రూమ్‌లు ఉండగా వందలాదిగా వచ్చె మహిళలకు అది చాలకపోవడంతో పాటు బట్టలు మార్చుచేసుకునే ప్రాంతంలో పై కప్పుకూడా లేకపోవడంతో రక్షణలేకుండా పోయింది.



సమావేశంలో మాట్లాడుతున్న వజ్రాల వెంకట నాగిరెడ్డి

విత్తనాలు నమూనా తీసే విధానం మార్చాలి

- పరీక్షల్లో నకిలీ అని తేలితే కంపెనీలను ఏ1గా చేర్చాలి
- రాష్ట్ర సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

గుంటూరు సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ విత్తనాల నమూనా తీసే విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని రాష్ట్ర ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్‌చేసింది. మంగళవారం గుంటూరులో రాష్ట్ర విత్తనవిక్రేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వజ్రాల వెంకటనాగిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ హైబ్రిడ్ మిరప విత్తనాలు నమూనా తీసినప్పుడు 450 గ్రాముల బరువు కలిగిన మూడు సీల్ ప్యాకెట్లు ఓపెన్ చేస్తున్నారని అన్నారు. అందులో ఒక్కొక్క ప్యాకెట్ నుంచి 10గ్రాములు నమూనా కింద అధికారులు తీసుకుంటున్నారని, మిగిలిన ప్యాకెట్లు ఎవరూ కొనడంలేదన్నారు. దానివల్ల విత్తనాల వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఇటువంటివిధానం వెంటనే మార్చాలని పేర్కొన్నారు. విత్తనాల నమూనా సేకరించి ల్యాబ్‌కి పంపిన తర్వాత అవి నకిలీ అని తేలితే వ్యాపారులను ఏ1 గా చేర్చుతున్నారని అన్నారు. సీల్ ప్యాకెట్ నుంచి విత్తనాలు సేకరించి అవి నకిలీ అని తేలితే కంపెనీ యజమానులను వదిలిపెట్టి, వ్యాపారులను నిందితులుగా చేర్చటాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. విత్తనాలు నకిలీ అని తేలినప్పుడు కంపెనీ యజమానులను ఏ1 గా చేర్చి, వ్యాపారులను సాక్షిగా ఉంచాలని అన్నారు. బీజీ-2 కాటన్ విత్తనాలు నమూనా తీస్తుంటే, హెచ్ టీ ఆనవాళ్ల ఉన్నట్లు కొన్ని ల్యాబ్‌ల్లో వస్తుండడం పట్ల కూడా వ్యాపారులు ఆందోళన చెందుతున్నారని నాగిరెడ్డి పేర్కొన్నారు. జీఓటీ, జెర్మినేషన్ ఇంత శాతం ఉందని వ్యవసాయ శాఖ నిర్ధారించిన తర్వాత వాటిని అమ్ముతున్న సమయంలో వస్తున్న సమస్యలకు విత్తనాల వ్యాపారులను బాధ్యులను చేయడం సబబు కాదని అన్నారు. చిన్న చిన్న కంపెనీలు వారికి సంబంధించిన విత్తనాలు అమ్మకాలు జరుపుతున్నాయని, ఆ తర్వాత ఏదైనా సమస్య వస్తే రైతులు వ్యాపారులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. దాన్ని నివారించేందుకు విత్తనాలు సరఫరా చేస్తున్న చిన్న కంపెనీలు రైతుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. త్వరలోనే వ్యవసాయ ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాలు తీసుకువెళ్తామని నాగిరెడ్డి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారి విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస రెడ్డి, పరమేశ్వర రెడ్డి, కార్యదర్శి చలపతిరావు, గుంటూరు జిల్లా చైర్మన్ సాంబిరెడ్డి, పల్నాడు జిల్లా చైర్మన్ హనిమిరెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, 26 జిల్లాల నుంచి ముఖ్యమైన విత్తన డీలర్లు పాల్గొన్నారు.



ఏడో శతాబ్దం లోని రూపులమ్మ దేవి ఆలయం

రూపులమ్మ.. కనబడవమ్మ

చరిత్ర బావి తరాలకు అతి భద్రంగా అందించాల్సిన అద్భుత సంపద. కనుమరుగు కాకుండా కాపాడుకోవాల్సిన అపురూప సంస్కృతి, ఘనమైన చరిత్రకు నిర్లక్ష్యం వలన రూపులమ్మ ఆలయం పూర్తిగా శిథిలమైపోయింది. ఆలయ గోపురం తప్ప ముఖద్వారమంతా చెరువులో పూడికమట్టితో మునిగిపోయింది. కనీసం మట్టి తొలగించి, అప్పటి ఆలయ విగ్రహాలను పరిరక్షించాల్సిన పురావస్తుశాఖ నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంది. ఆ కాలపు మాన్యుమెంట్స్ ఏమున్నాయోనని పరిశోధించాల్సిన అధికారులు, ఈ ఆల యానికి తమ రికార్డుల్లో ఓ గుర్తింపునిచ్చి వదిలేశారు. రూపులమ్మగా, మహాలక్ష్మి దేవమ్మగా ఆ కాలంలో ఓ వెలుగు వెలిగిన ఈ ఆలయాన్ని సంరక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఇక్ష్వాకులు, బుద్ధులు, జైనులు, శాతవాహనులు, చాళుక్యులు, హైహయరాజులు పాలించిన ఈ ప్రాంతాన్ని టూరిజం కేంద్రంగా అభివృద్ధి పరచాల్సిందిపోయి శిథిలాలను మరింత శిథిలావస్థకు చేరుస్తున్నారని ఈ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు.

గోపురం పదిలం 'అమ్మ' శిథిలం

- బాదామి చాళుక్యల కాలం నాటి రూపులమ్మ ఆలయం
- దుర్గి మండలం తేరాలలో శిథిలావస్థకు
- పూడిక మట్టిలో ముఖద్వారం

'పల్నాడు' అంటే అనుగురాజు, ఆయన కుమారులు నలగామ రాజు, మలిదేవరాజులు.. వారి మధ్య జరిగిన యుద్ధం.. ఇది మాత్రమే చాలా మందికి తెలుసు. కానీ , పల్నాట బాదామి చాళుక్యుల ఉనికి ఎంత మందికి తెలుసన్నది ప్రశ్నార్థకమే. కాల గర్భాన గతించిన చరిత్రలెన్నో నాటి కాలపు నిర్మాణాలతో వెలుగు చూసినా ఆదరణకు మాత్రం నోచుకోవడం లేదు. మన పక్కనే ఉన్నప్పటికీ గుర్తించలేని స్థితిలో ఉన్నాయి.

మాచర్లటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశాన్ని క్రీస్తు శకం 6-12 శతాబ్దాల మధ్య చాళుక్యులు పరిపాలించారు. 2వ శతాబ్దాంలో ఇక్ష్వాకుల సామంతులుగా ఉండే వీరు పల్లవుల ధాటికి తాళలేక కర్ణాటక వచ్చి స్థిరపడ్డట్లు చరిత్ర చెబుతోంది. అటు నుంచి రాయలసీమలోని కడప, కర్నూలుకు కూడా వీరి రాజ్యం విస్తరించింది. కర్ణాటకలో తమ స్వాధీనంలో లేని బాదామి ప్రాంతంలో కదంబులను ఓడించిన చాళుక్యులు బాదామి చాళుక్యులుగా ప్రసిద్ధి చెందారు. ఆ బాదామి చాళుక్యుల ఆలయ కట్టడాలను పోలిన రూపులమ్మ ఆలయం మాచర్లలో శిథిలావస్థలో ఉంది.



మట్టిలో పూడుకు పోయిన ముఖద్వారం

మహదేవమ్మ చెరువులో కొలువై..

అందరూ చూస్తూ ఎవరూ పట్టించుకోని ఈ శిథిలాలయం మాచర్లకు ఐదారు కిలో మీటర్ల దూరంలో ని దుర్గి మండలం తేరాల సమీపంలో మహాదేవమ్మ చెరువు ఉంది. ప్రస్తుతం దీన్ని బ్రహ్మనాయుడు చెరువుగా పిలుస్తారు. తేరాలలోని సిద్దేశ్వరస్వామి ఆలయాన్ని గతంలో ఏపీ హెరిటేజ్ అండ్ కల్చరల్ టూరిజంలో పరిశోధనలు చేస్తున్న రుచీసింగ్ సందర్శించారు. పక్కనే ఉన్న పాడుబడ్డ రూపులమ్మ ఆలయాన్ని ఆమె ఆసక్తిగా పరిశీలించి ఎన్నో శతాబ్దాల క్రితం నాటిదిగా గుర్తించారు. ఈ మేరకు భారత పురావస్తు శాఖకు ఈ సమాచారం అందించారు. ఆలయం రూపురేఖలు, దానిపై చెక్కిన నగిషీలు, శిల్పాలు, గోపురం తీరు వంటివన్నీ పరిశీలించి 7వ శతాబ్దంలో బాదామి చాళుక్యులు నిర్మించిన అతిపురాతన కట్టడంగా తమ రికార్డులకు ఎక్కించారు.



ఆలయం గోడలపై కళాకృతులు

ఏసీబీ వలలో వీఆర్వో

- రూ. 2 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



లంచం తీసుకుంటూ పట్టుబడిన వీఆర్వో హసీనా

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన భర్త పేరుతో ఉన్న పొలాన్ని ఆన్‌లైన్‌లో భార్య పేరుమీద మార్చడానికి(మ్యుటేషన్ కోసం) రూ.2లక్షలు లంచం తీసుకుంటూ గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలెం వీఆర్వో షేక్ హసీనా అవినీతి నిరోధకశాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ అదనపు ఎస్పీ మత్తె మహేంద్ర కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు రూరల్ మండలం వెంగళయపాలెం గ్రామానికి చెందిన ఎక్స్‌ఆర్మీ చెరుకూరి సత్యనారాయణ గత ఏడాది డిసెంబర్‌లో మృతి చెందారు. ఆయన పేరుతో గ్రామంలో ఎకరం 25 సెంట్లు వ్యవసాయ భూమి ఉంది. దానిని తన పేరు మీదకు మార్చుకునేందుకు (మ్యుటేషన్) కోసం సత్యనారాయణ భార్య ప్రమీల సచివాలయంలో దరఖాస్తు చేసుకునేందుకు గత నెల 28న వెళ్ళారు. అంకిరెడ్డిపాలెం వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న హసీనా వెంగళాయపాలెం గ్రామానికి గత అక్టోబరు 4 నుంచి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ప్రమీల దరఖాస్తు చేసుకున్న రోజునే హసీనా రూ. 2.5 లక్షలు డిమాండ్ చేసింది. అయితే తాను అంత ఇచ్చుకోలేనని ప్రమీల చెప్పడంతో చివరకు రెండు లక్షల 20 వేల రూపాయలకు బేరం కుదుర్చుకుంది. దీనిలో భాగంగా అదే రోజున ప్రమీల నుంచి పదివేలు తీసుకుంది. ఈ నెల 2న ప్రమీల సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా రెండు లక్షలు ఇస్తేనే పని పూర్తి చేస్తానని హసీనా స్పష్టం చేసింది. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితురాలు ప్రమీల ఏసీబీ అధికారులను సంప్రదించింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వెంగళాయపాలెంలోని సచివాలయంలో ప్రమీల నుంచి వీఆర్వో రూ. రెండు లక్షలు నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని నగదు స్వాధీనం చేసుకున్నారు. కాగా హసీనా గతంలో మంగళగిరి ప్రాంతంలో పనిచేసిన సమయంలో కూడా ఆమెపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. అక్కడ రూ. ఐదు కోట్ల భూ వివాదంలో కూడా ఆమె పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఆమె గతంలో పని చేసిన ప్రతి చోటా ఇదే తరహాలో ముక్కు పిండి లంచం వసూలు చేసేదని ఆరోపణలు ఉన్నాయి.

నర్సింగ్ విద్యార్థిని మృతి కేసులో

వీడిన మిస్టరీ

- లైంగిక సంబంధానికి ఒప్పుకోక పోవడంతో భవనంపై నుంచి తోసేసి చంపిన మహిళ

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : హాస్టల్‌పై నుంచి కిందపడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పంపాల సువర్ణ (23)అనే నర్సింగ్ విద్యార్థిని కేసులో మిస్టరీ వీడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతురాజు వెంకట్ అనే వ్యక్తి నెహ్రూనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో వృద్ధుల ఆశ్రయం, సధార్ హోం నడుపుతున్నాడు. రెండు నెలల కిందట పంపాలా సువర్ణ(22) అనే నర్సింగ్ చదివే విదార్థిని సధార్ హోమ్‌లో చేరింది. సువర్ణను అదే హాస్టల్‌లో వుంటున్న విజయలక్ష్మి (48) అనే మహిళ లైంగిక సంబంధం కోసం ఒత్తిడి చేసింది. అందుకు సువర్ణ ఒప్పుకోక పోవడంతో ఆమెతో గొడవపడింది. సువర్ణ బాత్‌రూమ్‌కు వెళ్ళిన సమయంలో విజయలక్ష్మి కూడా వెళ్ళింది. అక్కడ కూడా విజయలక్ష్మి ఒత్తిడి చేయగా ఆమె తిరస్కరించింది. దీంతో అక్కడ జరిగిన తోపులాటలో సువర్ణను విజయలక్ష్మి కిందకు నెట్టేసింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి తల్లిదండ్రులు లేకపోవడంతో చిన్నప్పటి నుంచి హాస్టల్స్‌లో ఉంటూ చదువుకుంటోంది.



నిరక్షరాస్యులకు అక్షరజ్ఞానం

ఉల్లాస్

పొదుపు సంఘాల మహిళలు ఆర్థిక సాధికారిత సాధించేలా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ, ప్రతీ సంఘంలోనూ దాదాపు ఇద్దరు లేదా ముగ్గురికి పైగా సభ్యులు నిరక్షరాస్యులుగా ఉంటున్నారు. ప్రస్తుతం వారందరినీ గుర్తించే పనిలో డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది ఉన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, వయోజన విద్యా విభాగం కలిసి 'ఉల్లాస్' కార్యక్రమం అమలు చేసేలా కార్యాచరణ రూపొందించింది.

- డిజిటల్ లావాదేవీలపై పొదుపు సంఘాల మహిళలకు అవగాహన
- సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం
- కాలానుగుణంగా మారేలా శిక్షణ
- సాయంత్రపు బడులు



సత్తెనపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) :చదువులేని మహిళల్లో అక్షరాస్యతపై చైతన్యం పెంపొందేలా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందు కోసం లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా చదువు చెప్పటానికి ముందుకు వచ్చే మహిళలు, యువతులను వాలంటీర్లుగా ఏర్పాటు చేసి వారి ద్వారా నిరక్షరాస్యులను సాధారణ డిజిటల్ అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. జాతీయ విద్యా విధానం-2020 పాలసీకి అనుగుణంగా దీనిని అమలుచేస్తున్నారు. ఇందులో భాగంగా ఐదు విభాగాల్లో తర్ఫీదు ఉంటుంది.

ప్రతి గ్రామం నుంచి 10 నుంచి 20 మంది మహిళలకు చదువు నేర్పిస్తారు. అక్షరాలు నేర్చుకోవడం, సంతకాలు చేయటంతో పాటు బ్యాంక్ లావాదేవీల నిర్వాహణ తదితర వాటి పై అవగాహన కల్పిస్తారు. ప్రధానంగా ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయటం, మొబైల్ బ్యాంకింగ్ తదితర డిజిటల్ అక్షరాస్యతపై తర్ఫీదు ఇస్తారు. తద్వారా వీరు మరొకరిపై ఆధారపడకుండా తమ సొంతంగా బ్యాంకుకు వెళ్ళి గాని, ఇంటి నుంచి గాని తమ ఖాతాకు, సంఘానికి సంబంధించిన పనులు చక్కబెట్టేలా శిక్షణ పొందనున్నారు. 'ఉల్లాస్' అమలు బాధ్యతను ప్రభుత్వం టీసీఎస్ సంస్థకు అప్పగించింది. శిక్షణ పొందే మహిళలకు సులువుగా అర్థమయ్యే రీతిలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సంస్థ అభివృద్ధి చేసింది. ఇందులో సమాచారం, బోధన, అభ్యాసన వీడియోలు తెలుగులోనే ఉంటాయి. శిక్షణ పొందిన వాలంటీర్ల ద్వారా మహిళలకు బోధించనున్నారు. గ్రామాల్లో ఉండే అంగన్‌వాడీ కేంద్రాలు, సామాజిక భవనాలను అక్షరాస్యకేంద్రాలుగా నిర్వహించనున్నారు. గతంలో అమలు చేసిన 'సాక్షర భారత్' తరహాలోనే సాయంత్రం బడులు ఉంటాయి. ప్రతి పది మందికి ఒక వాలంటీరు బోధిస్తారు. ఆరు నెలల పాటు జరిగే శిక్షణ ద్వారా ప్రగతి సాధించిన వారికి ధృవపత్రాలు ఇస్తారు. అదే విధంగా సార్వత్రిక విద్యా పాటం ద్వారా ఉన్నత తరగతులు చదివే వీలు కల్పిస్తారు. పల్నాడు జిల్లాలో 36,623 పొదుపు సంఘాలు ఉండగా, అందులో 3,71,023 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో నిరక్ష్యరాస్యులు 10,700 మంది ఉన్నారు.

నిరక్షరాస్యులు, వలంటీర్ల గుర్తింపు
- పీడీ బాలూ నాయక్, డీఆర్‌డీఏ పల్నాడు జిల్లా



నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దటానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థతో పాటు వయోజన విద్యా విభాగం సమన్వయంతో పని చేస్తున్నాయి. పల్నాడు జిల్లాలో పది వేల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం. ప్రస్తుతం నిర్లక్ష్యరాస్యులతో పాటు వాలంటీర్లను గుర్తించాం. తొలి దశలో శిక్షణ పొందుతారు. ఎవరైనా మిగిలి పోతే వారికి మలి దశలో శిక్షణ ఉంటుంది.



నేడు యడవల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బుధవారం మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు చిలకలూరిపేట రూరల్ పరిధిలోని యడవల్లి సబ్ స్టేషన్ ఫీడర్ మరమ్మతుల కారణంగా యడవల్లి, కట్టుబడివారిపాలెం గ్రామంలోని పరిశ్రమలకు, గృహాలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ మంగళవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పొగాకు సాగుకు రైతుల మొగ్గు

● చిలకలూరిపేట నియోజకవర్గంలో సుమారు 2వేల ఎకరాల్లో సాగు



మళ్ళల్లో పెరుగుతున్న పొగ నారు

నాదెండ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది సిరులు పండించిన పొగాకు సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో పొగాకు నారుకు డిమాండ్ పెరిగింది. గడిచిన రబీ సీజన్‌లో నల్ల బర్లీగా పిలిచే పొగాకును చిలకలూరిపేట నియోజకవర్గంలో సుమారు 1500 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. వాతావరణం అనుకూలించటంతో ఎకరాకు పది నుంచి 15 క్వింటాళ్ళ వరకు దిగుబడులు వచ్చాయి. ధర కూడా క్వింటా రూ.15వేలు వరకు పలకటంతో రైతులకు లాభాలు దక్కాయి. తెగుళ్ళతో పాటు ఆశించిన స్థాయిలో దిగుబడులు, ధరలు లేకపోవటంతో రైతులు పత్తి, మిర్చి సాగును తగ్గించారు. ఈ క్రమంలో వారి దృష్టి పొగాకు సాగుపై పడింది. చిలకలూరిపేట, నాదెండ్ల మండలాల్లో రైతులు ఇప్పటికే పొగాకు సాగు చేపట్టారు. గత ఏడాది సుమారు 1500 ఎకరాలు సాగు చేయగా ఈ ఏడాది రబీతో కలిపితే విస్తీర్ణం సుమారు ఐదు వేల ఎకరాల వరకు చేరవచ్చన్నది అంచనా. ఇప్పటికే సుమారు రెండు వేల ఎకరాల్లో పొగాకు మొక్కలు నాటారు. ఈ నెలాఖరుకు అంచనాల స్థాయిలో విస్తీర్ణం పెరగనున్నది. వర్షాలతో దెబ్బతిన్న పత్తి పైర్లను కూడా రైతులు కొన్ని గ్రామాల్లో తొలగించి పొగాకు సాగు చేపట్టేందుకు సిద్ధ మవుతున్నారు.




సాగులో ఉన్న పొగాకు పైరు

పెరిగిన నారు ధర... ఆశలన్నీ ధరల పైనే

గత నెలలో కురిసిన వర్షాలకు పొగ నారుమళ్లు కొంతమేర దెబ్బతినటంతో పాటు రైతులు పొగాకు సాగుపై ఆసక్తి చూపటంతో పొగనారు ధర రెట్టింపు అయింది. మొన్నటి వరకు నారు మూట ధర (ఆరు వేల మొక్కలు) రూ.1500 పలకగా ప్రస్తుతం రూ.2500వరకు చేరింది. ఎకరాకు మూటన్నర వరకు నారు పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో పొగాకు క్వింటా ధర రూ.15వేలకు పైగానే కొనసాగుతున్నది. ఇదే ధర కొనసాగుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. భవిష్యత్‌లో పొగ సాగు పెరటంతో ధరలు తగ్గుతాయా?, ఇదే ధర కొనసాగుతుందా? అనే విషయంపై రైతులు చర్చించుకుంటున్నారు. గతంలో వీఎస్‌టీ పొగాకును చేపట్టే వారు. ప్రస్తుతం ఆ పొగాకు సాగు చేపట్టేందుకు బ్యారెన్‌లు రైతులకు అందుబాటులో లేవు. ఈ క్రమంలో బర్లి పొగాకుకు డిమాండ్ ఉందని రైతులు చెబుతున్నారు.

పన్ను బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్

● చిలకలూరిపేట మునిసిపల్ కమిషనర్ శ్రీహరిబాబు



చిలకలూరిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పన్ను బకాయిల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు చిలకలూరిపేట మునిసిపల్ కమిషనర్ శ్రీహరిబాబు ఆంధ్రజ్యోతికి తెలిపారు. పన్నుల వసూళ్లు, వివిధ అంశాలపై కమిషనర్ తెలిపిన వివరాలు...

ప్రశ్న: మునిసిపల్ పన్నుల వసూళ్లు ఎలా ఉన్నాయి?

జవాబు: ఇంటి పన్నులు రూ.4కోట్లు, నీటిపన్ను రూ.4.23 కోట్లు బకాయిలుగా ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 30శాతం మేరకు మాత్రమే పన్నుల వసూళ్లు జరిగాయి. బకాయిల వసూలుకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. ఇప్పటివరకు పన్ను పరిధిలోకి రాని భవనాలను గుర్తించి వాటికి కూడా పన్నులు వేస్తాము.



ప్ర: మునిసిపాలిటీ అప్పుల పరిస్థితి ఏమిటి?

జ: మున్సిపాలిటీకి మొత్తం రూ.22కోట్ల మేరకు అప్పులు ఉన్నాయి. పాత బిల్లులు, కరంటు చార్జీలు చెల్లించవలసి ఉంది. గాంధీ పార్క్ తాకట్టుపెట్టి తీసుకున్న అప్పు కూడా ఉంది. నెలకు రూ.31లక్షలు అసలు, రూ.11 లక్షలు వడ్డీ ప్రతి నెలా చెల్లించవలసి ఉంది.

ప్ర: అక్రమ కుళాయి కనెక్షన్లను ఏం చేస్తారు?

జ: పట్టణంలో అక్కడక్కడ అక్రమ కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. వాటిని గుర్తించి క్రమబద్ధీకరించే పనిలో ఉన్నాము.

ప్ర: అమృత్ పథకం ఎంతవరకు వచ్చింది?

జ: చిలకలూరిపేట అమృత పథకం పూర్తికోసం ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, శాసన సభ్యుడు పత్తిపాటి పుల్లారావు గట్టి పట్టుదలతో ఉన్నారు. ఈ పథకం పూర్తికి రూ.90 కోట్లు అవసరం. దీంతోపాటు పట్టణంలో జాతీయ రహదారికి ఇరువైపులా ప్రధాన డ్రైన్లను శాశ్వత ప్రాతిపదికన నిర్మించడానికి రూ.55కోట్లు అవసరం. ఈ పనులకు నిధుల మంజూరుకు నేతలు కృషి చేస్తున్నారు.

ప్ర: కుక్కల బెడద గురించి పట్టించుకోవడం లేదంటున్నారు?

జ: నిజమే. కుక్కలను చంపడానికి నిబంధనలు అంగీకరించవు. ప్రతి కుక్కకు స్టెరిలైజేషన్ చేయించాలి. ఇందుకు ఒక్కొక్క కుక్కకు రూ.1,500 అవసరం. నిబంధనల ప్రకారం వీఆర్‌సీ సర్టిఫికెట్ ఉన్న ఆసుపత్రి ఇక్కడ ఉండాలి. తగిన ల్యాబ్, షెడ్‌లు కూడా ఉండాలి. ప్రజలు ఇబ్బందుల దృష్ట్యా ఈ సమస్యను అధిగమించేందుకు ప్రయత్నిస్తాం.

పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు

శావల్యాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు పంచాయతీ కార్యదర్శులను ప్రస్తుతం కార్యదర్శులు లేని గ్రామాలకు ఇన్‌చార్జి కార్యదర్శులుగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ గుంటుపాలెం కార్యదర్శి చింతా శ్రీనివాసరావును మతుకుమల్లి, కారుమంచిలకు, శావల్యాపురం కార్యదర్శి యాకోబును పోట్లూరు, వేల్పూరులకు, వయ్యకల్లు కార్యదర్శి సైదారెడ్డిని పిచికలపాలేనికి, బొందిలిపాలెం కార్యదర్శి బాలపరమేశ్వరరావును కనమర్లపూడికి, ఇర్లపాడు కార్యదర్శి రబ్బానీని కొత్తలూరుకు, ముంద్రువారిపాలెం కార్యదర్శి వాసును శానంపూడికి ఇన్‌చార్జిలుగా నియమించామన్నారు. ఇన్‌చార్జిలుగా నియమించబడిన పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేయాలన్నారు.

మిస్సింగ్ కేసును ఛేదించిన బొల్లాపల్లి పోలీసులు

బొల్లాపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూగచింతలపాలెం గ్రామానికి చెందిన భార్య, ఇద్దరు పిల్లలు రెండు రోజుల క్రితం అదృశ్యమైనట్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఎస్పీ ఆదేశాల మేరకు నరసరావుపేట డీఎస్పీ, వినుకొండ రూరల్ సీఐ ఆధ్వర్యంలో ఇంటినుంచి వెళ్ళిపోయిన మాలపాటి నర్స కుమారి, ఆమె ఇద్దరు చిన్న పిల్లలను 24గంటల్లో బొల్లాపల్లి ఎస్ఐ ఏ బాలకృష్ణ వారిని గుంటూరు పట్టణంలో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆమెను, చిన్నారులను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా 24గంటల్లో కేసును ఛేదించిన వినుకొండ రూరల్ సీఐ, బొల్లాపల్లి ఎస్ఐ, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ కే శ్రీనివాసరావు, నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి



తిమ్మాయిపాలెం రోడ్డులోని నాగమయ్య పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

వినుకొండ, నవంబరు 5 (ఆంధ్యజ్యోతి) పట్టణంలోని వివిధ దేవాలయాల్లో నాగుల చవితి పండుగను మంగళవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. వినుకొండ తిమ్మాయిపాలెం రోడ్డులోని నాగమయ్యస్వామి పుట్ట, బ్రహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని చెక్కవాగు సమీపంలోని శివాలయం వద్ద, గుంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఆవరణలోని నాగమయ్య పుట్ట, ఎన్ఎస్‌పీ కాలనీలోని పుట్టవద్ద భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.



గణపవరంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నాగుల చవితి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని నాగేంద్రస్వామి దేవాలయాల్లో పుట్టల వద్ద పూజలు చేశారు. ప్రధానంగా గణపవరంలోని నాగేంద్రస్వామి దేవస్థానం ప్రాంగణంలోని పుట్ట వద్దకు వేలాదిమంది మహిళా భక్తులు తరలివచ్చారు. దేవాలయ వార్షికోత్సవం కూడా నాగుల చవితిరోజే కావటంతో కమిటీ సభ్యులు సుమారు ఐదు వేల మందికి ప్రసాద వితరణ చేశారు. ఉదయం ఐదు గంటలకే పుట్ట వద్ద వార్లుపోసి అనంతరం పూజలు చేశారు. పలు సమాజాల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కార్యక్రమాలను దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మాటూరి సుధాకర్, గంగా కుమారయ్య, పోంద్రు నాగేశ్వరరావు, సింగు సత్యనారాయణ, ఎస్.మధుసూదన రావు తదితరులు పర్యవేక్షించారు.

● నూజెండ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెండ్ల, ఉప్పలపాడు, వీ అప్పాపురం తదితర గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయాల్లో పూజలు నిర్వహించి నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అదేవిధంగా ఐనవోలులో పోలేరమ్మ దేవాలయం రెండో వార్షికోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నరసరావుపేటలో డిప్యూటీ సీఎం పవన్‌కు ఘనస్వాగతం



పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, కార్యకర్తలు

నరసరావుపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచవరం మండలంలో సరస్వతి పవర్ భూముల పరిశీలనకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నరసరావుపేట మీదగా వెళ్ళారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా కేంద్రం, పల్నాడు ముఖ ద్వారం నరసరావుపేటలో జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. పవన్ కళ్యాణ్ బొకే అందుకొని పార్టీ శ్రేణులకు, అభిమానులకు అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు జీవీఎస్ ప్రసాదు, జిల్లా అధికార ప్రతినిధి షేక్ అబ్దుల్ రఫూఫ్, వినుకొండ జనసేన ఇన్‌చార్జి రాయల నాగశ్రీనివాసరావు, గుంటూరు పార్టీ కార్యదర్శి బెల్లంకొండ ఈశ్వర్, పల్నాడు కార్యదర్శి అంకమ్మరావు, రొంపిచర్ల అధ్యక్షుడు అచ్చుల సాంబశివ రావు, గురజాల వాసురామ్, నారదాసు వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా ఏడుని యోజవర్గాల జనసేన నాయకులు, వీర మహిళలు, అభిమానులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు తులసి గ్రూప్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. తులసి గ్రూప్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించగా అందులో 80మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాత పరీక్ష, హెచ్‌ఆర్ రౌండ్స్ నిర్వహించి ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు డిగ్రీ పూర్తయిన అనంతరం విధులలో చేరాల్సి ఉంటుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యతోపాటు ఉద్యోగాలు పొందటానికి తగిన ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి విద్యార్థి క్యాంపస్ ప్లేస్మెంట్‌లో పాల్గొని తమ నైపుణ్యానికి తగిన ఉద్యోగాన్ని నిర్ణయించుకోవాన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ కే నాసరయ్య, టీపీవో ఎం.బాలకోటేశ్వరరావు, తదితరులు అభినందించారు.

పని దినాలు పెంచి ఉపాధి హామీ నిధులు భారీగా సాధించాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామి కింద ప్రతి గ్రామంలో పని దినాలు పెంచి కేంద్ర ప్రభుత్వ నిధులు పెద్ద ఎత్తున సాధించాలని అధికారులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. మంగళవారం తన నివాసంలో జరిగిన సమావేశంలో ఏపీవోలు, టీఏలు పూర్తి స్థాయిలో గ్రామాల్లో పని దినాలు కేటాయించటం లేదని, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రత్తిపాటికి అందించిన ఫిర్యాదు నేపథ్యంలో మూడు మండలాలకు చెందిన ఎంపీడీవో, ఏపీవోలు, టీఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో పేద వర్గాల ప్రజలకు పని దినాలు పెంచటం వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులను, మెటీరియల్ కాంపోనెంట్ రూపంలో పెద్ద ఎత్తున పొంది గ్రామాల్లో మరింత అభివృద్ధి సాధించ వచ్చన్నారు. ఈ సమావేశంలో మూడు మండలాల పార్టీ అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామేపల్లి సాయి బాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

యడ్లపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లను ప్రజలకు అందించడమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. యడ్లపాడు మండలంలోని గుత్తావారిపాలెం, కారుచోల గ్రామాలలో రూ.22లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.4,500 కోట్లతో రోడ్ల నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో రోడ్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు తీసుకెళుతున్నారన్నారు. ప్రస్తుతం గ్రామాల్లోని రోడ్లను చూస్తుంటే 20ఏళ్ల వెనక్కు వెళ్ళినట్లుగా కనిపిస్తోందని, వైసీపీ అసమర్థ పాలనే ఈ దుస్థితికి కారణమని మండిపడ్డారు. గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, టీడీపీ నాయకులు కె సాయిబాబు, ఎం.శ్రీనివాసరెడ్డి, కె రఘురామారావు, పి సాంబశివరావు, జి శ్రీరామ్మూర్తి, పి వెంకయ్య, షేక్ గౌసుల్‌వర, ఐ వెంకటకోటయ్య, సయ్యద్ సద్దాం, బోడా, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

కట్టుకథలతో జగన్ తప్పుడు ప్రచారం

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వినుకొండ టౌన్, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో కట్టుకథలతో జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇదేపనిగా దుష్ప్రచారం చేస్తున్నారని, నిజానికి ఐదేళ్ళ అరాచకాల రక్తం మడుగులో కూరుకుపోయిన జగన్ మోహన్‌రెడ్డి, వేదాలు వల్లించడం మానుకోవాలని జీవీ హితవు పలికారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు సంబంధించి పదేపదే జగన్ సాక్షిలో అడ్డగోలుగా అబద్ధాలు వండివార్చుతున్నారని ధ్వజమెత్తారు. ఇదే జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రజాస్వామ్య హక్కులను ఎలా ఖూనీచేశారో, మర్చిపోయారా అని ప్రశ్నించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం అన్నమాటకే అర్థం లేకుండా ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని ఓపెన్ జైలుగా మార్చి నిరంకుశ పాలన సాగించిన నియంత జగన్ అన్నారు. దారితప్పిన కొందరు పోలీసులు, సీఐడీని జేబు సంస్థగా వాడి తప్పుడు కేసులు అరెస్టులతో ఎంత బయోత్పాతం సృష్టించారో ప్రజలు చూశారన్నారు. వైసీపీ దుర్మార్గాలను భరించలేకనే 11 సీట్లతో సరిపెట్టి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు.

జగన్‌పై బురద చల్లేందుకే పవన్ కల్యాణ్ పర్యటన

● మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

నరసరావుపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగన్‌మోహన్‌రెడ్డిపై బురద చల్లేందుకే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన జరిగిందని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన నరసరావుపేట తన గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపీ కాకముందు 20ఏళ్ల క్రితం కొన్న భూములపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. వెయ్యి ఎకరాల భూమి జగన్‌మోహన్‌రెడ్డి చట్టపరంగానే కొన్నారన్నారు. టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు హైకోర్టులో కేసులు వేసి కర్మాగారాన్ని కట్టకుండా కుట్రలు చేశారన్నారు. పల్నాడులో సంఘీ సిమెంట్స్, అంబుజా సిమెంట్స్, మై హోమ్స్, హిమామి సిమెంట్స్ స్థలాలు తీసుకొని ఇప్పటివరకు కర్మాగారాలు కట్టలేదన్నారు. మీకు చిత్తశుద్ధి ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో శాంతి, భద్రతల నిర్వహణలో విఫలమైందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వయంగా ఒప్పుకున్నారన్నారు. సరస్వతి భూములకు సంబంధించి ఫారెస్ట్ ల్యాండ్ ఉంటే విచారణ జరిపి అటవీ భూములు ఉంటే రికవరీ చేసుకోవచ్చన్నారు. పవన్ కళ్యాణ్ పల్నాడు పర్యటనలో అభివృద్ధి పనులపై రివ్యూ ఉంటుందని ఆశించామన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో మా పోరాటాలు ఉంటాయన్నారు. సరస్వతికి అన్ని అనుమతులు వచ్చాక తప్పకుండా కర్మాగారాన్ని నిర్మించి ప్రజలకు ఉపాధి కల్పిస్తామన్నారు.

కరాటే పోటీలలో చిన్నారి ప్రతిభ

యడ్లపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్-2024 పోటీలలో తమ పాఠశాలకు చెందిన నాలుగో తరగతి విద్యార్థిని బచ్చు నూతన సిరి అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు స్థానిక నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ సృజన తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 3న విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరిగాయన్నారు. యడ్లపాడుకు చెందిన నూతన సిరి కాటా ఈవెంట్ సి కేటగిరిలో ద్వితీయ బహుమతి కైవసం చేసుకుంది.



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రవాణా, స్పోర్ట్స్ శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని వెలగపూడిలో మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం కలిశారు. నరసరావుపేట పట్టణంలోని కోడెల శివప్రసాద రావు స్టేడియం, ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. తప్పకుండా అభివృద్ధికి సహకారం అందిస్తానని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఆరోగ్యశాఖ మంత్రికి ఆహ్వానం

రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం కలిశారు. నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా ప్రారంభించబోయే బ్లడ్ బ్యాంక్, ఐసీయూల ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. ఎమ్మెల్యేతో పాటు నరసరావుపేట వైద్యశాల చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి

● ఎన్నికల పరిశీలకులు పంచుమర్తి భూపతిరావు



ఎన్నికల నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పంచుమర్తి భూపతిరావు

వినుకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలకు పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలుపు చాలా కీలకం అని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు పంచుమర్తి భూపతిరావు తెలిపారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో స్థానిక శివయ్య స్తూపం సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఓటర్ నమోదు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలంటే పట్టభద్రులంతా ఓటర్‌గా నమోదు చేసుకోవాలని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్సీ ఓటర్లు నమోదు చురుగ్గా సాగుతోందని, ఈ నెల 6వ తేదీ బుధవారం సాయంత్రం నాలుగు గంటలవరకే గడువు ఉందన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఓటర్ దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

కార్యక్రమంలో ఘట్టమనేని రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు పోట్లూరి సైదారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్, జనసేన నాయకులు నాగశ్రీను, పి.వి సురేష్, బీజేపీ నాయకులు మేడమ్ రమేష్, గట్టుపల్లి శ్రీనివాసరావు, అజీజ్, నన్రా కిశోర్, న్యాయవాది ఎలవర్తి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు: డీడీఏ

ఈపూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే చీడపీడల బెడద తగ్గడంతో పాటు పెట్టుబడి కూడా తగ్గి దిగుబడి పెరుగుతుందని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి తెలిపారు. మండలంలోని అంగలూరు, గుండేపల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వరి, మిరప పైర్లను పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి ఆర్ రామారావు మాట్లాడుతూ పీఎం కిసాన్ పెండింగ్ ఉన్నవారు, ఆధార్, బ్యాంకు లింక్ లేని వారు పోస్టల్ అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు గాయత్రి, రైతులు పాల్గొన్నారు.

పంటల బీమాతో రైతులకు ధీమా: ఏవో

నూజెండ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకంలో తాము సాగుచేస్తున్న పైర్ల వివరాలు నమోదు చేసుకోవటం ద్వారా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వారి పంటకు బీమా వర్తిస్తుందని మండల వ్యవసాయ అధికారి సుగుణాబేగం అన్నారు. సోమవారం మండలంలోని పెద్దవరం, పాతచెరుకుంపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. రైతులు సాగు చేస్తున్న కంది, వరి, మిరప పైర్లను ఏవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధూపాటి సురేష్ కుమార్, ఏఈవో ఎలీషా, గ్రామ వ్యవసాయ సహాయకులు జీ మణికంఠ, వై గోపీ, జెడ్డా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



శావల్యాపురంలో ఆశ వర్కర్లతో మాట్లాడుతున్న జిల్లా గణాంకాధికారి నీలకంఠేశ్వరరావు

ఆశ వర్కర్లు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

● జిల్లా గణాంకాధికారి నీలకంఠేశ్వరరావు

శావల్యాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్లు గ్రామాల్లోని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారికి ఉన్నతమైన సేవలందించాలని, విధుల్లో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా గణాంకాధికారి నీలకంఠేశ్వరరావు అన్నారు. ఆశ డే కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు జిల్లా విస్తరణాధికారి శ్రీనివాసరావుతో కలసి ఆయన మంగళవారం శావల్యాపురానికి వచ్చారు. ఏఎన్ఎంలు, ఆషా వర్కర్ల పనితీరు, రికార్డులు, ఆన్‌లైన్ నమోదు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలను తనిఖీ చేశారు. జిల్లా గణాంకాధికారి నీలకంఠేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వేసే వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయాలని, ప్రతి వైద్యసేవను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఉదయాన్నే విధులకు రాగానే ముఖఆధారిత హాజరును తప్పనిసరిగా నమోదు చేయాలని, హాజరు సక్రమంగా వేయనివారికి జీతాలను కట్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వైద్యాధికారి మాన్యం రాధాకృష్ణన్, హెల్త్ సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, ఉమాదేవి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో గృహోపకరణాలు దగ్ధం

వయ్యకల్లు (శావల్యాపురం) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఇంటిముందు వేసిన పందిరికి నిప్పంటుకొని మంటలు ఇంట్లోకి వ్యాపించి విలువైన సామగ్రి కాలిపోయిన సంఘటన శావల్యాపురం మండలం వయ్యకల్లు ఎస్సీ కాలనీలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాసరయ్య తెలిపిన వివరాల ప్రకారం వయ్యకల్లు ఎస్సీ కాలనీకి చెందిన దారా ఏసురత్నం వ్యవసాయ కూలీ. ఇటీవల ఇంట్లో శుభకార్యం జరగడంతో తన డాబా ఇంటి ముందు తాటాకులతో పందిరి వేశాడు. మంగళవారం మధ్యాహ్న సమయంలో పందిరి పక్కనున్న విద్యుత్ వైరు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి పందిరికి అంటుకొని, అనంతరం మంటలు ఇంటి లోపలికి వ్యాపించి ఇంట్లోని ఫ్రిజ్, డబుల్‌కాట్ మంచం, డ్రస్సింగ్ టేబుల్, రెండు బీరువాలతో పాటు కొంత సామగ్రి కాలిపోయాయి. దీంతోపాటు బీరువాలో రూ.1.5లక్షల నగదు కూడా అగ్నికి ఆహుతైనట్లు తెలిపారు. విషయం తెలుసుకొన్న మండల తహసీల్దార్ సుజాత ఆదేశాల మేరకు ఆర్ఐ నాసరయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించి మొత్తం రూ.3లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. దాతల సహకారంతో బాధితుడికి తక్షణసాయాన్ని అందించారు.

ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం 40,105 దరఖాస్తులు

● ఓటు పొందేందుకు నేడు చివరి రోజు

నరసరావుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు.. కృష్ణా జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు పొందేందుకు జిల్లాలో 40,105 మంది పట్టభద్రులు దరఖాస్తుకున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి మురళి మంగళవారం తెలిపారు. ఓటు హక్కు కోసం దరఖాస్తుకు బుధవారం చివరి రోజు అన్నారు. 2021 నవంబర్ 1 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులైన వారు తమ డిగ్రీ ప్రొవిజినల్ సర్టిఫికేట్, సాధారణ ఎన్నికల ఓటరు కార్డు జిరాక్స్ కాపీలతో పాటు పాస్‌పోర్టు సైజు ఫోటోను ఫారం-18తో కలసి సంబంధిత తహసీల్దార్ కార్యాలయం, మునిసిపల్ కార్యాలయం లేదా ఆన్‌లైన్ విధానంతో దరఖాస్తు చేసువాలని కోరారు.

చిలకలూరిపేటలో 5 వేల దరఖాస్తులు

చిలకలూరిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి మంగళవారం నాటికి చిలకలూరిపేట పట్టణం, మండలం పరిధిలో ఐదు వేల దరఖాస్తులు అందాయని అర్బన్ ఏఈఆర్వోగా వ్యవహరిస్తున్న మునిసిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు తెలిపారు. బుధవారంతో గడువు ముగుస్తున్నందున అరు లైన వారందరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ దరఖాస్తులను ఇంటింటికి తిరిగి పరిశీలించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఉమ్మడి గుంటూరు జిల్లా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ అయిన గుంటూరు డీఆర్వోకు ఈ నెల 20వ తేదీలోపు వాటిని పంపిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 23న ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేస్తారని పేర్కొన్నారు. అనంతరం వాటిపై అభ్యంతరాలను స్వీకరిస్తారని తెలిపారు. డిసెంబరు 30వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారని ఆయన పేర్కొన్నారు. 2021 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తిచేసిన వారందరూ ఓటరుగా నమోదు కావటానికి అర్హులని ఆయన పేర్కొన్నారు. కాగా దరఖాస్తు గడువును మరికొన్ని రోజులపాటు పొడిగించాలని ఎస్టీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు.